క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: స్థానిక బీసీ కాలనీ సమీపంలోని వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. వెంకయ్య స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ కామాక్షితాయి ఆలయ చైర్మన్ పీ లక్ష్మీసుబ్రహ్మణ్యానాయుడు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సహకారంతో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులను గమనించి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పీ లక్ష్మీ కాంతమ్మ, కమిషనర్ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో సూర్యనారాయణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారిని ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఆర్ సూర్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యనాయుడు, ఈఓ గిరికృష్ణ ఆలయ మర్యాదలో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అతిథిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

జొన్నవాడ పీహెచ్‌సీలో తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని జిల్లా కుష్టు, క్షయ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యారోగ్య కార్యక్రమాలకు సంబంధించిన లక్ష్యాలపై సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ అహ్మద్‌బాబు, సిబ్బంది నరసింహులు, సురేష్‌కుమార్, యాసిన్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి మందిరంలో పూజలు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో పూజా కార్యక్రమాలను వేడుకగా నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిలుక ఏకాదశిని పురస్కరించుకొని ఈ నెల 24న తులసీ దామోదర కల్యాణం.. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 26న 1008 ప్రమిదలతో సహస్ర జ్యోతిర్లింగార్చన.. 27న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం.. డిసెంబర్ 11న శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించనున్నామని వెల్లడించారు. మందిర కమిటీ కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి

నెల్లూరు(పొగతోట): రికార్డుల నిర్వహణను పక్కాగా చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ మండలాల ఏఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ మండలాల ఏఓలు పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు క్రీడలు అవసరం

- ఎంఈఓ వసంతకుమారి



ఇందుకూరుపేటలో పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

కొడవలూరు: విద్యార్థులు పుస్తక పఠన ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ జీ వసంతకుమారి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొడవలూరు గ్రంథాలయం ఆధ్వర్యంలో నార్తురాజుపాళెం, కొడవలూరు ఉన్నత పాఠశాలలు, కొడవలూరు గురుకుల పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, రంగవల్లులు, క్విజ్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, విజ్ఞానంతో మంచి భవిష్యత్తును పొందవచ్చని తెలిపారు. లైబ్రేరియన్ కే రాజేశ్వరి మాట్లాడుతూ విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, ఖాదర్ బాషా, సుబ్బారావు, ఆదినారాయణరావు, షకీల పాల్గొన్నారు.

- యల్లాయపాళెం గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'గ్రంథాలయాలు-విద్యార్థులు', 'మాదక ద్రవ్యాలు-యువత' అనే అంశాలపై శనివారం వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండిట్ చెంచయ్య మాట్లాడుతూ ప్రతిభా పోటీలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలుగులోకి రావడంతో పాటు బిడియాన్ని వీడి ఏ విషయాన్ని అయినా ధైర్యంగా వ్యక్తపరచగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జే సురేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని దినచర్యగా అలవర్చుకోవాలి

ఇందుకూరుపేట: పుస్తక పఠనాన్ని దినచర్యగా అలవర్చుకోవాలని ఇందుకూరుపేట పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇందుకూరుపేట శాఖ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి హాజరై పుస్తక పఠంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నాగరాజు పాల్గొన్నారు.

విడవలూరు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విడవలూరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. విడవలూరు జిల్లా పరిషత్ హైస్కూల్, అక్షర స్కూల్‌కు చెందిన 60 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నిరూప మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని దినచర్యగా అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాణి, శ్రీనివాస్, పద్మావతి పాల్గొన్నారు.



కొడవలూరులో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



యల్లాయపాళెంలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



విడవలూరులో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి నిరూప

గ్రామీణ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.21 కోట్లు

- మంత్రి కాకాణి చొరవతో నిధులు మంజూరు



బ్రిడ్జి నిర్మించనున్న నావూరు పెద్దవాగు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు, వాగులపై బ్రిడ్జిలు, డ్రెయిన్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ కొత్తగా రూ.21.04 కోట్లను మంజూరు చేసింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం పీఎంజీఎస్‌వై కింద సర్వేపల్లికి నిధులను కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.75 కోట్లతో గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. అందులో భాగంగానే తోడేరు రోడ్డు పనులను ప్రారంభించారు. నావూరు పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం లేక భారీ వర్షాలు పడితే చప్టాపై వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, కొండలరాయుడుకండ్రిక తదితర గ్రామాల రాకపోకలు స్తంభించేవి. ఈ సమస్య పరిష్కారానికి పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి రూ.3.62 కోట్లు మంజూరు చేయించారు. అలాగే పొదలకూరు-సంగం మెయిన్‌రోడ్డు నుంచి కొండలరాయడుకండ్రిక వయా ప్రభగిరిపట్నం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి మీదుగా రోడ్డు నిర్మాణానికి రూ.10.83 కోట్లు, వెంకటాచలం-ముత్తుకూరు వయా కప్పలదొరువు, నిడికుంటపాళెం, దర్పల మిట్ట, అట్రంవారికండ్రిక మీదుగా రోడ్డు నిర్మాణానికి రూ.6.59 కోట్లు మంజూరు చేయించారు.

స్వచ్ఛ ఓటరు జాబితాను రూపొందించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ చినఓబులేసు

పొదలకూరు : స్వచ్ఛ ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా బీఎల్వోలు పనిచేయాలని, ఎక్కడా విమర్శలకు తావు ఇవ్వకూడదని సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, తెలుగంగ డిప్యూటీ కలెక్టర్ బీ చినఓబులేసు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల బీఎల్వోలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఓట్ల చేర్పులు, మార్పులను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కే.వీరవసంతరావు పాల్గొన్నారు.

22 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు



కొడవలూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ధర్మప్రచార వారోత్సవాలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జొన్నవాడ కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. శనివారం ఆయన వివిధ మండలాల్లో నాయకులతో కలిసి ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. ఈ నెల 22న కోవూరు, 23న బుచ్చిరెడ్డిపాళెం, 24న కొడవలూరు, 25న విడవలూరు, 26న నెల్లూరురూరల్, 27న జొన్నవాడ, 28న ఇందుకూరుపేటలో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డి.నిరంజన్‌బాబురెడ్డి, పి.రాధాకృష్ణారెడ్డి, వీరి చలపతిరావు, ఎం.శ్రీనివాసులురెడ్డి, కె.కేశవరావు, టి.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని కృష్ణపట్నం ఎస్టీ కాలనీ జెడ్పీహైస్కూల్లో మాదక ద్రవ్యాలు-దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని తెలిపారు. సమాజంలో గౌరవాన్ని కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలు కొనుగోలు చేసినా, విక్రయించిన కఠిన శిక్షలు పడతాయన్నారు. వాటి సమాచారం తెలిసిన వారు 14500 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పీ సరళ, మహిళా పోలీసు ఎస్‌కే షాహిన పాల్గొన్నారు.

28న కామాక్షితాయి కల్యాణోత్సవం



కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీనివాసులురెడ్డి

ఇందుకూరుపేట: హైందవ ధర్మప్రచారంలో భాగంగా గంగపట్నంలో ఈ నెల 28న జొన్నవాడ కామాక్షితాయి, మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కామాక్షితాయి, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ కమిటీ, అధికారులు నిర్ణయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో చాముండేశ్వరిదేవి ఆలయంలో కామాక్షితాయి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జొన్నవాడ నుంచి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి కల్యాణోత్సవం, విశేష పూజలు, హోమాలు, అన్నప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపా కటాక్షం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శాంతయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



కోవూరు: మాట్లాడుతున్న హెచ్‌ఎం రాధారాణి

కొడవలూరు: పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని 80 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠశాలల అభివృద్ధికి వార్షిక ప్రణాళిక బడ్జెట్‌పై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. పాఠశాలల హెచ్‌ఎంలు రూపొందించే ప్రణాళిక ఆధారంగానే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఎంఈఓ-1 జీ వసంతకుమారి మాట్లాడుతూ ప్రతి పాఠశాల అభివృద్ధికి ఏమి అవసరమో ముందుగా గుర్తించాలన్నారు. అవసరాలను బట్టి ప్రణాళిక రూపొందిస్తే వాటి ఆధారంగా మండల స్థాయిలో ప్రణాళిక, బడ్జెట్ రూపకల్పన జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నందున పాఠశాలల ప్రణాళికలకు అనుగుణంగానే నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. తద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమానికి గండవరం హైస్కూల్ హెచ్‌ఎం జీ శ్రీనివాసరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఎంఈఓ-2 ఎస్ అంకయ్య, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కోవూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించడంపై హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ-2 వై చెంచులక్ష్మమ్మ సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల అభివృద్ధికి వార్షిక ప్రణాళిక బడ్జెట్‌పై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ నెల 27వ తేదీలోగా ప్రణాళికలను పూర్తిచేసి గ్రామసభల్లో ఆమోదం పొంది మండల విద్యావనరుల కేంద్రంలో అందజేయాలని కోరారు. అనంతరం హెచ్‌ఎంలు వై రాధారాణి, మూర్తి, వెంకటేశ్వర్లు నాయుడు, ప్రసాద్‌రెడ్డి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

'ఆడుదాం ఆంధ్ర' వివరాల నమోదు



కోవూరు: మండలంలో డిసెంబర్‌లో జరగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సంబంధించి వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం చేపట్టారు. షటిల్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీలకు సంబంధించి ఎంపిక చేసిన పాఠశాలల క్రీడా మైదానాల ఫొటోలు, వాటి వివరాలను ఫిజికల్ డైరెక్టర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పోటీలకు సంబంధించిన షెడ్యూల్ వివరాలను పొందుపరిచారు. ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, సిరాజుద్దీన్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటి సోమవారం



పొదలకూరు : శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కోటి సోమవారాన్ని పురస్కరించుకుని పొదలకూరులోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి శనివారం తెలిపారు. ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించే మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమే త వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస శనివారం సందర్భంగా విశేషాభిషేకాలు, పూజ లు నిర్వహించారు. మహిళలు పుష్పాకృతిలో కా ర్తీక దీపాలను వెలిగించారు.కార్తీక దీపాల వెలుగులో ఆలయం శోభాయమానంగా కనిపించింది.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా..

- ఆటో, ట్రాక్టర్ ఢీ
- ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

విడవలూరు: మండల కేంద్రమైన విడవలూరులోని శివారు ప్రాంతంలో ఆటో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొనడంతో శనివారం రాత్రి ఆరుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు...మండలంలోని అన్నారెడ్డిపాళేనికి చెందిన నాలుగు కుటుంబాల వారు శుక్రవారం మాలకొండకు వెళ్లారు. శనివారం దైవదర్శనం చేసుకుని స్వగ్రామాలకు తిరుగు పయనమయ్యారు. రాత్రి విడవలూరులోని ప్రభుత్వ కళాశాల సమీపంలోకి చేరుకోగానే ఆటో విడవలూరు నుంచి ఆర్లపాడు కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మందిలో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందలేదు.

కాలువ పూడికతీత పనుల ప్రారంభం



పూడికతత పనులను ప్రారంభిస్తున్న ఇరిగేషన్ అధికారులు, నాయకులు

మనుబోలు: కండలేరు నుంచి మనుబోలు పెద్ద చెరువుకు సాగునీటిని సరఫరా చేసే కాలువలో పూడికతీత పనులను ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈలు వేమారెడ్డి, ఠాగూర్, ప్రసాద్ వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి జేసీబీలతో పనులను ప్రారంభించారు. వీరంపల్లి నుంచి మనుబోలు చెరువు వరకు కాలువ పూడికతో నిండి ఉండడంతో నీరు సాఫీగా పారేందుకు వీలుగా పూడికతీత పనులను చేపడుతున్నారు. జేసీబీలతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రెండ్రోజుల్లో పనులు పూర్తవుతాయని, ఆ వెంటనే కండలేరు నుంచి నీటిని విడుదల చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చేడిమాల బుజ్జిరెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీందర్‌రెడ్డి, తూమాటి వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ విజేతగా నిలవాలని కాంక్షిస్తూ..

నెల్లూరు(బృందావనం): అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్స్‌లో భారత్ జట్టు విజయం సాధించాలని కాంక్షిస్తూ ప్రపంచకప్ నమూనాతో నగరంలో ఊరేగింపును కార్పెంటర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రపంచకప్ నమూనాను కారుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల్లో ఊరేగింపును నిర్వహించామని ఆయన చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు రమేష్, రవీంద్ర, అనిల్, సురేష్, అవినాష్ పాల్గొన్నారు.

కొబ్బరిచెట్లు నరికివేతపై ఫిర్యాదు

ఇందుకూరుపేట: మండలంలోని ఏడో మైలుకు చెందిన నెట్రంబాక వెంకటశేషయ్య అలియాస్ శివ తన పొలంలోని కొబ్బరిచెట్లను నరికివేసి విక్రయించుకున్నాడని అదే గ్రామానికి చెందిన నెట్రంబాక రమణయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు గతంలో తన పొలాన్ని కొంతమేర మోసపూరితంగా రిజిష్టర్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా కొబ్బరిచెట్లను ఇలాగే నరికేశారని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు వద్ద శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు..నెల్లూరుకు చెందిన షేక్ బషీర్ మోటార్ సైకిల్‌పై కసుమూరుకు వెళుతుండగా, మలుపు రోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో బషీర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బుచ్చిరెడ్డిపాళెంరూరల్: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో బెజవాడ బుజ్జమ్మ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, భాషా సామర్థ్యాలను వెలికి తీయడానికి వ్యాసరచన పోటీలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి మంజులత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.